

# కనువిప్పు

ఊరి చివర స్వాములవారు వచ్చి ఉన్నారని, విభూతి, రక్షరేకులు యిచ్చి రోగాలు నయం చేస్తున్నారని- ఎన్నెన్నో మహిమలు చేసి చూపిస్తున్నారని, ఆయన వెంట నలుగురు శిష్యులు కూడా వచ్చారని, బలే మహిమగల దేవుడికి ప్రతిరూపమైన స్వాములవారని ఊరు ఊరంతా పాక్కిపోయింది. జనం తండోప తండాలుగా రావటం, ఆయన దర్శనం చేసుకోటం, విభూతి- రక్షరేకులు తీసుకుంటూ జబ్బులు నయం చేయించుకోటం తమకు తోచిన తృణమో, పణమో, నగో, వెండో ఆయనకు ఆనందంగా సమర్పించుకోవటం చాలా రోజులుగా జరుగుతూంది. చాలావరకూ ఆ ఊరి వారంతా ఆయనకు దాసులయిపోయి, ధారాళంగా కానుకలు సమర్పించసాగారు.

ఇదంతా చాలా కాలంగా గమనిస్తున్న వీరయ్య, ఊరి ప్రజలతో, ''మీకేమయినా పిచ్చి పట్టిందా, ఆ మాయలమారి స్వాముల వలలో పడ్డారు. అదంతా నాటకం, బూటకం. ఆయనకేం మహిమలూ- పాడూ లేవు. ఆయనేం దేముడు కాదు! అంతా మిమ్మల్ని మోసం చేసి, మీ వద్ద నుంచి ధనం, వస్తువులు ధారాళంగా గుంజి పోగు చేసుకుంటూ బాగుపడుతున్నాడు. అంతే, ఏ రోజో ఈ వూరి నుంచి ఉడాయిస్తాడు – అవన్నీ పట్టుకుని!'' అంటూ మొత్తుకుంటూ చెప్పసాగాడు.

అయినా, ప్రజలు వీరయ్య మాటలు లెక్కపెట్టలేదు. వీరయ్య తమ ఊరికి పట్టిన శనిని వదలగొట్టాలని ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చాడు.

కొద్ది రోజులు పోనిచ్చి, ఓ ఆరుగురు శిష్యులను పోగు చేసుకుని- ఆ స్వాములవారు ఉండే చెట్టుకి ఎదురుగా ఉన్న చెట్టు కింద కూర్చుని తపస్సు చేసుకుంటూ, మధ్య మధ్య యంత్రాలు

శ్రీమతి జి. రామలక్ష్మి, హైదరాబాద్

వేస్తూ, మంత్రాలు చదువుతూ, ఉచితంగా వైద్యం, మూలికలు, తావీదులూ, విభూతి యిస్తూ, అన్నింటికీ చిరునవ్వే సమాధానంగా నోరు విప్పకుండా జాగ్రత్త పడసాగాడు.

ఉచితం అనే సరికి జనం అటునించి ఇటుకి ఒగ్గి, భక్తి భావాలు చూపిస్తూ, దండాలు పెడ్తూ దాసోహం అనసాగారు. రోగాలు నయం చేసినా, ఈ కొత్త స్వాములవారు నయాపైసా అయినా పుచ్చుకోక మూలికలు- తావీదులూ- వగైరాలు యివ్వటం, చిరునవ్వే అన్నింటికీ సమాధానంగా చెప్పటం- అందరికీ నచ్చింది, ఆకర్షించింది. అటు స్వాములవారి ముఖం ముడుచుకుపోయింది- ఇటు వైపుకు చేరిపోయిన జనసమూహాన్ని చూసి!



ఆ రోజు– ఏకాదశి. కొత్త స్వాములవారు - కోడిగుడ్డు లోంచి బంగారు ఉంగరాలనీ, వెండినీ తీసి చూపించాడు. అదే పనిగా కుప్పలు కుప్పలుగా విభూతి రాల్చసాగాడు. తాడుకు చివర ఉంగరం వ్రేలాడదీసి తాడుకు నిప్పంటించినా, అది ఎంతకూ అంటుకోకపోయే సరికి, జనం చప్పట్లు కొట్టేస్తూ, ''ఆహా, కోడిగుడ్డులో బంగారం చూపించారు; తాడుని నిప్పు కూడా కాల్చలేకపోతోంది. ఓహో ఏం మహిమా! ఏం మహిమా!! నిస్స్వార్థపరులు, మన పాలిటి దైవ స్వరూపులు; సాక్షాత్ ఆ దైవమే కరుణించి ఈ రూపంలో మన ఊరిలో సాక్షాత్కరించారేమో!'' అంటూ పాటలు, భజనలు చేస్తున్న తన్మయత్వంలో ఉన్న ప్రజలను ఉద్దేశించి, ''ఆగండి, ఆగండి; శాంతించండి, కంగారుపడకండి, నిదానించి మిగతా సంగతి పూర్తిగా చూసి మరీ ఓ నిర్ణయానికి రండి!'' అన్నాడు ఆ కొత్త స్వాములవారు. బిత్తరపోయి, అదిరిపోయి చూడసాగారు శిష్యులతో సహా మరో స్వాములవారు. ''ఏమిటా!'' అని! ప్రజలంతా గప్ చిప్‌గా ఉన్నారు చేతులు జోడించి,

''చూడండి, నేను స్వాములవారినీ కాదు, దేవుడ్నీ కాదు. ఇతర సాధువుల్లా నేను మీ అందరికీ ''కనువిప్పు'' కలిగించి- జ్ఞానోదయం కలిగించాలనే సదుద్దేశంతో మేజిక్ నేర్చుకుని, మీ ముందుంచాను. అదే వీరయ్యగా చూపిస్తే, మీరు నమ్మేవారు కాదు; రాళ్ళు విసిరి కొట్టేవారు. అందుకే- ఆ సాధువులా నే నో

సాధువు వేషం ధరించి, మహిమల్లా మేజిక్‌నే చూపించాను. మీరు గుడ్డిగా నన్ను దేవుడ్నిగా మార్చేసి, అసలు నే నెవరో కూడా తెల్సుకో కుండా నాకు పట్టం కట్టి, కొబ్బరికాయలు కొట్టసాగారు. ఇంతకూ ఆ సాధువు చేసిందే నేను చేసాను. తాడుని ఉప్పుద్రావకంలో నానేసి ఎండ బెట్టి చివర ఉంగరం కట్టి వ్రేళ్ళడదీసాను. అది ఎండపోయి కాల్చినా కాలక కర్రలా నిలబడి బేలన్స్‌గా ఉంది. అది మహిమ కాదు మేజిక్! అలాగే కోడి గుడ్డును అయోడిన్‌లో ముంచి ఉంచితే అది ద్రవంగా ముద్దగా అవుతుంది. అప్పుడు దానిలో ఈ బంగారు వెండి సరుకులు కలిపేసి తిరిగి గుండ్రంగా కలిపి ఎండబెట్టితే అది గట్టిగా తిరిగి కోడి గుడ్డులా తయారయి అం దులో ఈ వస్తువులు వుంటాయి. ఇది మహిమేం కాదు; అలాగే విభూతి- అల్యూమినియం పాత్రలో, గాఢ గంధకికామ్లము రాసినచో అది రసాయనిక చర్య జరిగి, దానిని రాసిన కొద్దీ విభూధి రాలుతుంది. అంతే తప్ప ఎవరి గొప్పా ఏం లేదు. ఎవరూ దేవుళ్ళు కారు; ఎవరూ సాధువులూ, ఋషులూ కారు; అంతా మాన వులే- ఎటొచ్చీ ఒకరిని ఒకరు మోసం చేసుకో టం, ఒకరి పొట్ట ఒకరు కొట్టడం తప్ప! నేను మీ మామూలు వీరయ్యని; నన్ను క్షమించండి! మీరు గుర్తు పడతారనే నేను అనుకున్నది సాధిం చేవరకూ నోరు విప్పలేదు- సాధువు వేషంలో ఉండగా!'' అన్నాడు.

అంతా విని ప్రజలు- ''మాకు కళ్ళు తెరిపిం చావు వీరయ్యా- మా అందరికీ నిజంగా 'కనువి ప్పు' కలిగించావు. నీ ఋణం తీర్చుకోలేము!'' అంటూ అటు చూసే సరికి, ఆ సాధువు శిష్యులతో సహా పారిపోబోయాడు. గబుక్కున ఊరి ప్రజలు వాళ్లని పట్టుకుని, డబ్బు, వెండి, బంగారు, నగలు సైతం లాక్కుని, ''ఓరి దొంగ చచ్చినోడా ఎంత పని చేసావ్, మహిమలంటూ మందు పొట్లాలు మాకు యిచ్చి మింగిస్తూ, మా రోగాలు తగ్గంగానే నీ మహిమే అంటూ నాటకా లాడ్తావా?'' అంటూ చావబాదారు.

